VC NEWS వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
నిజామాబాద్ బుధవారం 30 సెప్టెంబర్ 2026
వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:04 సంచిక: 94

దురుసుగా ప్రవర్తించిన పోలీసులను గుర్తించండి

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

కాంగ్రెస్ ఆరోపణలు నిరాధారం

రాజ్యాంగబద్ధ సంస్థలపై దాడులు చేయడం సరికాదని వ్యాఖ్య

వాస్తవాలను ప్రజల ముందుంచామని వెల్లడి

విలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి వ్యాఖ్యలు

హైదరాబాద్, సెప్టెంబర్ 29 : ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధ సంస్థలపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలు నిరాధారమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు అన్నారు. ప్రజల మద్దతు పొందడంలో విఫలమవుతున్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రక్రియపై అనుమానాలు సృష్టించే ప్రయత్నం చేస్తోందని ఆయన విమర్శించారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, తరువాయి 2 వ పేజీలో...

తుమ్మిడిహట్టి బ్యారేజీ అనుమతులకు

చొరవ తీసుకోండి

కేంద్ర జల్ శక్తి మంత్రిని కలిసిన ముఖ్యమంత్రి

తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులపై విస్తృత చర్చ

కృష్ణా, గోదావరి బేసిన్ అంశాల ప్రస్తావన

తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వ అనుమతులు త్వరగా లభించేలా కేంద్రం చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర జల్ శక్తి మంత్రి సి.ఆర్. పాటిల్‌ను కోరారు. ఢిల్లీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి కేంద్ర మంత్రిని కలిసిన ముఖ్యమంత్రి, తెలంగాణకు సంబంధించిన కీలక నీటిపారుదల ప్రాజెక్టుల అంశాలను వివరించారు.

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29: తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర కోరిన సమాచారాన్ని ఇప్పటికే అందించినట్లు తెలిపారు. తుమ్మిడిహట్టి బ్యారేజీని పూర్తి జలమట్టం 152 మీటర్ల స్థాయిలో నిర్మించేందుకు తెలంగాణ, మహారాష్ట్ర మధ్య తరువాయి 2 వ పేజీలో...

రాజ్యాంగ విలువల కోసం

పోరాటం కొనసాగిస్తాం

దళిత, ఆదివాసీ ఆత్మగౌరవ సదస్సులో భట్టి విక్రమార్క

ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉన్న కాంగ్రెస్

కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ ఎంపీల వేదిక ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన దళిత–ఆదివాసీ ఆత్మగౌరవ సదస్సులో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశంలోని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం అంశాలపై చర్చ జరిగినట్లు తెలిపారు. సదస్సులో మాట్లాడిన భట్టి విక్రమార్క హల్ద్వానీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేపై జరిగిన ఘటనను ఖండించారు. దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీతో పాటు అణగారిన వర్గాలపై జరుగుతున్న దాడులు, అన్యాయాలపై ఆందోళన వ్యక్తం చేశారు.

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 : సామాజిక న్యాయం కోసం స్వరం వినిపిస్తున్న ప్రతిపక్ష నాయకులపై కేసులు నమోదు చేయడం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై నమోదవుతున్న కేసులు సంస్థాగత నిష్పక్షపాతతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని వ్యాఖ్యానించారు. రాజ్యాంగ పరిరక్షణ, సమానత్వం, తరువాయి 2 వ పేజీలో...

పేదల సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యం

రెడ్ హిల్స్‌లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపన

ఏడాదిలోపే లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందిస్తామని హామీ

విలువైన ప్రభుత్వ భూముల్లోనే గృహ నిర్మాణం: పొంగులేటి

హైదరాబాద్, సెప్టెంబర్ 29: పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, అందులో భాగంగానే ఇందిరమ్మ గృహ నిర్మాణ కార్యక్రమాన్ని ప్రతిష్మాత్మకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. నాంపల్లి నియోజకవర్గ తరువాయి 2 వ పేజీలో...

పప్పుధాన్యాల సాగులో దేశంలో రెండో స్థానంలో తెలంగాణ

జాతీయ రబీ సదస్సులో రాష్ట్ర ప్రగతిని వివరించిన తుమ్మల

పంటల వైవిధ్యీకరణలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన చర్యల ఫలితంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో పప్పుధాన్యాల సాగు గత ఏడాదితో పోలిస్తే 36 శాతం పెరిగి దేశంలోనే రెండో స్థానంలో నిలిచిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. జాతీయ రబీ సదస్సులో పాల్గొన్న ఆయన తెలంగాణ వ్యవసాయ రంగంలో సాధిస్తున్న పురోగతి, రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు.

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 : పంటల వైవిధ్యీకరణ, డిజిటల్ వ్యవసాయం, వ్యవసాయ మౌలిక వసతుల అభివృద్ధి, రైతులకు రుణ సదుపాయాల విస్తరణ వంటి అంశాలను వివరించారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం, వర్షపాతంలో అనిశ్చిత పరిస్థితులను ఎదుర్కొనేందుకు తెలంగాణలో ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తున్నామని మంత్రి తెలిపారు. నీటి లభ్యత, స్థానిక పరిస్థితులకు తరువాయి 2 వ పేజీలో...

ఆడోళ్లతో కొట్టిస్తా

ఇప్పటికైనా నోరు దగ్గర పెట్టుకోవాలి

కొండా సురేఖ మాస్ వార్నింగ్

ఊడిపోయే పదవుల్ల ఉన్నోళ్లు తమ ముందు కుప్పిగంతులేస్తే ఊకోమని.. వాళ్ల ను ఆడోళ్లతోటే కొట్టిస్తామని మాజీ మంత్రి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. మావోళ్ల మీద ఈగ వాలినా మంచిగుండదన్నారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 29: మిమ్మల్ని కొట్టనీకి మొగోళ్లే అవసరం లేదని.. నా ఎన్మన్న ఆడోళ్లే సాలన్నారు. ఇప్పటికైనా నోరు దగ్గర పెట్టుకోకుంటే ఎక్కడ దొర్కితే అక్కడ్నే కొడ్తారని హెచ్చరించారు. వరంగల్‌లో మంగళవారం సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్ల అన్ని స్థానాలల్ల గెల్వాలని సూచించారు. రెండ్రోజులైతే ఊశిపోయేటోళ్లు (ఎమ్మెల్సీ బస్వ రాజు సారయ్య) ఒకలున్నరు. నిన్నగాక మొన్న ఎక్కినోళ్లు (కుడా చైర్మన్ గుండు సుధారాణి) ఒకలున్నరు. నిన్నగాక మొన్న ఎక్కినోళ్లు తరువాయి 2 వ పేజీలో...

ఢిల్లీ రవాణా సౌకర్యాల విస్తరణకు 1,941 కోట్ల ప్రాజెక్టులు

బరాపుల్లా ఎలివేటెడ్ రహదారి మూడో దశ ప్రారంభం

ప్రయాణ సమయం తగ్గి ట్రాఫిక్ సమస్యలకు ఉపశమనం

దేశ రాజధాని ఢిల్లీలో రవాణా మౌలిక వసతులను మరింత బలోపేతం చేసి ప్రజలకు సులభమైన ప్రయాణ సౌకర్యాలు కల్పించేందుకు రూ.1,941 కోట్లకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రారంభించారు. అలాగే మరికొన్ని కీలక రవాణా ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు.

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29: ఈ ప్రాజెక్టులు ఢిల్లీ నగరంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించి ప్రజల ప్రయాణాన్ని మరింత వేగవంతం చేయనున్నాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రూ. 1,635 కోట్ల వ్యయంతో నిర్మించిన బరాపుల్లా ఎలివేటెడ్ రహదారి మూడో దశను ప్రజలకు తరువాయి 2 వ పేజీలో...

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

దురుసుగా ప్రవర్తించిన పోలీసులను గుర్తించండి

అసెంబ్లీ వద్ద ఘటనపై డీజీపీకి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసుగా ప్రవర్తించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులను గుర్తించాలని రాష్ట్ర డీజీపీని హైకోర్టు ఆదేశించింది. మంగళవారం ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆ అధికారుల వివరాలను సేకరించి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు సమర్పించాలని డీజీపీ సీవీ ఆనంద్‌కు సూచించింది. సెప్టెంబర్ 7న అసెంబ్లీ వర్షాకాల సమావేశాల మొదటి రోజున ఈ ఘటన చోటుచేసుకుంది. నల్ల టీ–షర్టులు ధరించి నిరసన తెలిపేందుకు వెళుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, ఎమ్మెల్యేలకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. ఈ ఘటనలో తమ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అమర్యాదగా ప్రవర్తించారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, బాధ్యులైన అధికారులపై అసెంబ్లీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు ఉంటుందని స్పష్టం చేసింది. ఒక మహిళా ఎమ్మెల్యే చీర లాగారని, మాజీ హోంమంత్రిగా పనిచేసిన మరో మహిళా ఎమ్మెల్యేను మెడ పట్టుకుని నెట్టారని బీఆర్ఎస్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. శాసనసభ్యులను అసెంబ్లీలోకి వెళ్లకుండా నిలువరించే హక్కు పోలీసులకు లేదని, నిబంధనల ఉల్లంఘన జరిగితే చర్యలు తీసుకోవాల్సింది స్పీకర్ మాత్రమేనని సెప్టెంబర్ 8నే హైకోర్టు తేల్చి చెప్పిన విషయం విదితమే. మరోవైపు, ఈ ఘటనకు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావు సహా పలువురు ఎమ్మెల్యేలపై కేసులు నమోదయ్యాయి. అయితే, తాము ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసులు నమోదు చేయలేదని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ ఇప్పటికే జాతీయ మహిళా కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్‌తో పాటు గవర్నర్‌కు కూడా ఫిర్యాదు చేసింది.

అదుపుతప్పి మాట్లాడితే మహిళలతో కొట్టిస్తా

హైదరాబాద్:మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండా సురేఖ తనదైన శైలిలో రాజకీయ ప్రత్యర్థులకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. మంగళవారం వరంగల్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, నోరు అదుపులో పెట్టుకోకపోతే మహిళలతో దేహశుద్ధి చేయిస్తానని ఘాటుగా హెచ్చరించారు. కొంతమంది నేతల తీరుపై కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇష్టానుసారం మాట్లాడితే మహిళలతో చిత్తుచిత్తుగా కొట్టిస్తాం. ఒక్కో మహిళ నలుగురిని కొడుతుంది, జాగ్రత్త. ప్రతిపక్ష నేతలు గాలిలో కత్తులు తిప్పుతున్నారు" అంటూ ఆమె ధ్వజమెత్తారు. కొందరు నేతలు తమ హద్దులు మీరుతున్నారని, అలాంటి వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో పార్టీ అంతర్గత పరిణామాలపైనా ఆమె స్పందించారు. కాంగ్రెస్ నేతలంతా విభేదాలను పక్కన పెట్టి, పార్టీ బలోపేతం కోసం సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులంతా ఐక్యంగా ఉంటేనే పార్టీ ప్రగతి పథంలో ముందుకు సాగుతుందని ఆమె సూచించారు.

తెలంగాణలో విస్తృతమైన పెట్టుబడి అవకాశాలు

ఫ్రాంక్‌ఫర్ట్: జర్మనీలో తెలంగాణ శాసనసభ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ , శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నేతృత్వంలోని అసెంబ్లీ ప్రతినిధి బృందం పర్యటన కొనసాగుతోంది. జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో తెలంగాణలో పెట్టుబడి అవకాశాలు, తెలుగు ప్రవాసులతో అనుసంధానం అంశాలపై సమావేశం నిర్వహించారు. తెలంగాణలో అందుబాటులో ఉన్న పెట్టుబడుల అవకాశాలు, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, ఇన్నోవేషన్, టెక్నాలజీ వంటి వివిధ రంగాల్లో ఉన్న అవకాశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ గారు, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ను భారత కాన్సులేట్ ప్రతినిధులు శాలువాతో సత్కరించారు. అంతకుముందు.. ఈ బృందానికి అక్కడి అధికారులు ఘన స్వాగతం పలికారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. "తెలంగాణ రాష్ట్రంలో ఇన్వెస్టర్స్ కు అపారమైన అవకాశాలు ఉన్నాయని, గ్రేటర్ హైదరాబాద్ చాలా వేగంగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. హైదరాబాద్ పెట్టుబడులకు అనుకూలమైన ప్రాంతంగా అభివృద్ధి చెందిందని, ముఖ్యంగా ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఇన్నోవేషన్ వంటి రంగాల్లో హైదరాబాద్ ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. విదేశాల్లో స్థిరపడిన తెలుగు ప్రజలు తమ మాతృభూమితో తమ అనుబంధాన్ని కొనసాగిస్తూనే, తెలంగాణ అభివృద్ధిలోనూ భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు. జర్మనీతో పాటు యూరప్‌లోని పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు తెలంగాణలో ఉన్న అన్ని అవకాశాలను పరిశీలించాలని కోరారు. ప్రవాస తెలంగాణ వాసులు రాష్ట్రానికి పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలను తీసుకురావడంలో గొప్ప వారధిగా నిలవాలని స్పీకర్ ప్రసాద్ సూచించారు. "ప్రపంచంలోని వివిధ దేశాల్లో ఉన్న తెలుగు వాళ్లు తమ ప్రతిభతో ఉన్నత స్థానాలకు చేరుకోవడం చాలా గర్వకారణమని, వారు జన్మభూమి అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ గారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసన మండలి సెక్రెటరీ డా నరసింహాచార్యులు, అసెంబ్లీ సెక్రెటరీ ఆర్ తిరుపతి, లేజిస్లేచర్ ప్రతినిధి బృందం సభ్యులు, భారత కాన్సులేట్ అధికారులు, తెలుగు ప్రవాసులు తదితరులు పాల్గొన్నారు. జర్మనీ–భారత పార్లమెంటరీ మైత్రి కార్యక్రమంలో భాగంగా 2024లో జర్మనీలోని రైన్‌ల్యాండ్ రాష్ట్ర స్పీకర్ హెండ్రిక్ హెరింగ్ బృందం హైదరాబాద్‌లోని అసెంబ్లీని సందర్శించింది. ఇప్పుడు దానికి రిటర్న్ విజిట్‌గా తెలంగాణ స్పీకర్ బృందం జర్మనీలో పర్యటిస్తోంది. యూరప్ లోని జర్మనీ తర్వాత ఆస్ట్రియా, స్విట్జర్లాండ్ లో ఈ బృందం పర్యటించనుంది. వచ్చే నెల 9వ తేదీన శాసన సభ స్పీకర్ గారు, శాసన మండలి చైర్మన్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం తిరిగి హైదరాబాద్ కు చేరుకుంటుంది

సెప్టెంబర్ 13 నుంచి 18వ తేదీ వరకు దక్షిణాఫ్రికాలోని కేప్ టౌన్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ లో కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్ జరిగింది. కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్ కు కొనసాగింపుగా విదేశీ పర్యటనకు ఈ బృందం వెళ్లింది.

పేదల సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

పరిధిలోని రెడ్ హిల్స్‌లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. పేదవాడు జీవితంలో ఒక్కసారైనా సొంత ఇంటిలో నివసించాలనే ఆకాంక్షను నెరవేర్చడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని మంత్రి అన్నారు. నగర ప్రాంతాల్లో ప్రభుత్వానికి చెందిన వివిధ శాఖల భూములను గుర్తించి వాటిని గృహ నిర్మాణ శాఖకు బదిలీ చేస్తున్నామని తెలిపారు. ఈ భూముల్లో బహుళ అంతస్తుల నివాస సముదాయాలను నిర్మించి పేద కుటుంబాలకు అందించనున్నట్లు చెప్పారు.

ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడం కంటే పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడానికే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పారదర్శక ఎంపిక ప్రక్రియలో 480 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు మంత్రి వెల్లడించారు. మొదటి విడతలో అవకాశం రాని వారికి తదుపరి విడతల్లో ఇళ్లు కేటాయిస్తామని భరోసా ఇచ్చారు. నగరంలోని పలు నియోజకవర్గాల్లో ఇందిరమ్మ గృహ నిర్మాణానికి అవసరమైన భూములను గుర్తించామని, అనేక ప్రాంతాల్లో నిర్మాణ పనులకు సంబంధించిన ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. త్వరలోనే మరిన్ని ప్రాంతాల్లో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.

ప్రస్తుతం నిర్మించనున్న ప్రతి నివాస గృహం విలువ సుమారు రూ.80 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉంటుందని మంత్రి తెలిపారు. రెండు లేదా మూడు సంవత్సరాలు కాకుండా కేవలం ఏడాదిలోపే నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. గతంలో మాదిరిగా కేవలం పత్రాలు ఇచ్చి వదిలేయకుండా నేరుగా లబ్ధిదారుల పేర్లపైనే నమోదు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అదనపు భారం లేకుండా పూర్తి హక్కులతో ఇళ్లు అందేలా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ టవర్స్‌లో నివసించే కుటుంబాలకు భవిష్యత్తులో ఎలాంటి మౌలిక సదుపాయాల సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని మంత్రి వివరించారు. ముఖ్యంగా మురుగునీటి పారుదల వ్యవస్థను ప్రధాన మార్గాలతో అనుసంధానం చేసి శాశ్వత పరిష్కారం కల్పిస్తామని తెలిపారు. నిర్మాణ పనుల నాణ్యతపై లబ్ధిదారులకే పర్యవేక్షణ అవకాశం కల్పిస్తామని, వారానికి ఒక రోజు నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి తమ ఇల్లు ఎలా నిర్మితమవుతోందో స్వయంగా పరిశీలించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. పేదలను నగరానికి దూరంగా తరలించి ఇళ్లు నిర్మించే విధానాన్ని ప్రజా ప్రభుత్వం అనుసరించడం లేదని మంత్రి స్పష్టం చేశారు. జీవనోపాధి, విద్య, ఆరోగ్యం వంటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే గృహ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ప్రతి తండా, ప్రతి గూడెం, ప్రతి వార్డు, ప్రతి డివిజన్‌లో అర్హులైన పేదలకు ఇళ్లు నిర్మించి అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

తుమ్మిడిహట్టి బ్యారేజీ అనుమతులకు చొరవ తీసుకోండి

మొదటి పేజీ తరువాయి

త్వరగా అవగాహన కుదిరేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఆ స్థాయిలో బ్యారేజీ నిర్మాణం జరిగితే గ్రావిటీ విధానంలో నీటిని ఎల్లంపల్లికి తరలించే అవకాశం ఉంటుందని వివరించారు. దీనివల్ల విద్యుత్ వినియోగం, నిర్వహణ వ్యయం గణనీయంగా తగ్గుతుందని పేర్కొన్నారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, డిండి ఎత్తిపోతల పథకం, సీతారామ సాగర్ బహుళార్థక ప్రాజెక్టు, గౌరవెల్లి రిజర్వాయర్‌కు పెండింగ్‌లో ఉన్న పర్యావరణ అనుమతులను త్వరగా మంజూరు చేయాలని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రిని కోరారు. అనుమతుల జాప్యం వల్ల ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం పెరుగుతోందని, అభివృద్ధి పనులు ఆలస్యమవుతున్నాయని వివరించారు. సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జల సంఘం వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతులను కూడా త్వరితగతిన మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు సమగ్ర నివేదికను ఇప్పటికే సమర్పించినట్లు పేర్కొంటూ, నీటిపారుదల ప్రణాళికలు అంతర్రాష్ట్ర అంశాలకు సంబంధించిన ఆమోదాలు త్వరగా ఇవ్వాలని కోరారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిరభ్యంతర పత్రం కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో చర్చలు కొనసాగుతున్నట్లు తెలిపారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాల్సిన టెలిమెట్రీ వ్యవస్థలను వేగవంతం చేయాలని కూడా ముఖ్యమంత్రి కోరారు. తొలి దశ టెలిమెట్రీ పరికరాల ఏర్పాటుకు అవసరమైన నిధులను తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే జమ చేసిన విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రెండో, మూడో దశల పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ కాకా వంశీ గడ్డం, రాష్ట్ర ప్రభుత్వ నీటిపారుదల సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు. తెలంగాణలో సాగునీటి వనరుల విస్తరణ, ప్రాజెక్టుల పూర్తి కోసం కేంద్రం సానుకూల సహకారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది.

పప్పుధాన్యాల సాగులో దేశంలో రెండో స్థానంలో తెలంగాణ

మొదటి పేజీ తరువాయి

అనుగుణంగా రైతులు పంటలను ఎంపిక చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఈ క్రమంలోనే పప్పుధాన్యాల సాగు గణనీయంగా పెరిగి రాష్ట్రం జాతీయ స్థాయిలో ముందంజలో నిలిచిందన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు నేల సారాన్ని కాపాడడంలో కూడా పప్పుధాన్యాల సాగు కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.

రాష్ట్రంలో నెలకొన్న కరువు, లోటు వర్షపాత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మొక్కజొన్న, జొన్న పంటలను ధరల మద్దతు పథకం పరిధిలోకి తీసుకురావాలని కేంద్రాన్ని కోరినట్లు తుమ్మల వెల్లడించారు. అనేక మండలాలు తీవ్ర వర్షాభావాన్ని ఎదుర్కొంటున్నందున మండలాల వారీగా పరిస్థితులను అంచనా వేసి ప్రత్యేక కేంద్ర సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. సూక్ష్మ సాగునీటి ప్రాజెక్టులు, నీటి సంరక్షణ చర్యలు, రక్షిత సాగునీటి వ్యవస్థలకు అదనపు సహకారం అవసరమని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ సాగు విస్తరణలో తెలంగాణ రైతులు విశేష స్పందన చూపారని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో అదనంగా లక్షకు పైగా హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు విస్తరించిందని, వేలాది మంది రైతులు ఈ పంట సాగులోకి వచ్చారని వివరించారు. ఆయిల్‌పామ్ రైతులకు గిట్టుబాటు ధరలు లభించేలా క్రూడ్ పామ్ ఆయిల్ దిగుమతి సుంకాన్ని గతంలో ఉన్న 44 శాతానికి పునరుద్ధరించాలని కేంద్రాన్ని కోరినట్లు చెప్పారు. దీనిపై స్పందించిన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ ఆయిల్‌పామ్ ధరల అంశాన్ని పరిశీలించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

వ్యవసాయ రంగంలో శాస్త్రీయ విధానాలను మరింత విస్తరించేందుకు తెలంగాణలో మట్టి ఆరోగ్య పరీక్షల లక్ష్యాన్ని రెట్టింపు చేయాలని కేంద్రాన్ని కోరినట్లు తుమ్మల తెలిపారు. ప్రస్తుతం ఉన్న కృషి విజ్ఞాన కేంద్రాలు రాష్ట్ర అవసరాలకు సరిపోవడం లేదని, అదనంగా 16 కేంద్రాలను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కొత్త వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం వేగంగా రైతులకు చేరాలంటే పరిశోధన, విస్తరణ వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కొడంగల్‌లో అగ్రి వ్యాపార పార్కు, పొడి వాతావరణ ఉద్యాన పంటల కోసం అత్యుత్తమ కేంద్రం ఏర్పాటు ప్రతిపాదనలను కేంద్రం సానుకూలంగా పరిశీలించాలని మంత్రి కోరారు. రైతులకు విత్తనాలు, ఎరువులు మాత్రమే కాకుండా సాంకేతిక పరిజ్ఞానం, నేల ఆరోగ్య సమాచారం, సకాలంలో రుణాలు, మార్కెట్ అవకాశాలు, నీటి పొదుపు పద్ధతులు కూడా అవసరమని పేర్కొన్నారు. తెలంగాణ వ్యవసాయ రంగ అభివృద్ధికి అవసరమైన ప్రత్యేక ప్రతిపాదనలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

ఢిల్లీ రవాణా సౌకర్యాల విస్తరణకు 1,941 కోట్ల ప్రాజెక్టులు

మొదటి పేజీ తరువాయి

అంకితం చేశారు. ఈ రహదారి అందుబాటులోకి రావడంతో తూర్పు ఢిల్లీ, దక్షిణ ఢిల్లీ ప్రాంతాల మధ్య సిగ్నల్ రహిత రాకపోకలు సాధ్యమవుతాయని అధికారులు తెలిపారు. నగరంలోని ప్రధాన మార్గాలపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గడంతో పాటు వేలాది మంది ప్రయాణికులకు సమయం ఆదా కానుంది.

ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడిన అమిత్ షా, దేశవ్యాప్తంగా మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రహదారులు, వంతెనలు, రైల్వేలు, పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ఢిల్లీ వంటి మహానగరాల్లో పెరుగుతున్న జనాభా, వాహనాల సంఖ్యకు అనుగుణంగా ఆధునిక రవాణా వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. బరాపుల్లా ఎలివేటెడ్ రహదారి మూడో దశ పూర్తికావడంతో నగరంలోని పలు ప్రాంతాల మధ్య ప్రయాణ దూరం, సమయం గణనీయంగా తగ్గనుందని అధికారులు వివరించారు. ముఖ్యంగా ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారవేత్తలు ప్రతిరోజూ ఎదుర్కొనే ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గే అవకాశం ఉందన్నారు. ఇంధన వినియోగం తగ్గడంతో పాటు వాయు కాలుష్యాన్ని కూడా నియంత్రించేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని తెలిపారు.

అదనంగా మోదీ మిల్–సావిత్రి సినిమా ఫ్లైఓవర్, లోనీ అండర్‌పాస్ నిర్మాణ పనులకు అమిత్ షా శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత నగరంలోని రద్దీ కూడళ్ల వద్ద ట్రాఫిక్ సమస్యలు తగ్గి రాకపోకలు మరింత సులభతరం కానున్నాయని చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆధునిక రవాణా సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. దేశ అభివృద్ధికి మౌలిక వసతుల నిర్మాణమే పునాదిగా నిలుస్తుందని అమిత్ షా పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా భారీ స్థాయిలో రహదారులు, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, పట్టణ అభివృద్ధి ప్రాజెక్టులు అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టులు ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరచడంతో పాటు ఆర్థికాభివృద్ధికి కూడా తోడ్పడతాయని ఆయన అన్నారు.

రాజ్యాంగ విలువల కోసం పోరాటం కొనసాగిస్తాం

మొదటి పేజీ తరువాయి

సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని భట్టి విక్రమార్క తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల గౌరవం, హక్కుల రక్షణ కోసం పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

దేశ నిర్మాణంలో అణగారిన వర్గాలకు సముచిత స్థానం కల్పించాలన్నదే కాంగ్రెస్ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా జరిగే అన్యాయాలపై ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ సదస్సుకు వివిధ రాష్ట్రాల కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ వర్గాల నాయకులు, సామాజిక సంస్థల ప్రతినిధులు హాజరై సామాజిక న్యాయం, సమాన హక్కుల అంశాలపై తమ అభిప్రాయాలు వెల్లడించారు.

ఆడోళ్లతో కొట్టిస్తా

మొదటి పేజీ తరువాయి

అసలైనోళ్లా.. లేక డూప్లికేటా మీరే ఆలోచించుకోర్రి. ఇంకోసారి మా ముందు కుప్పిగంతులేస్తే ఊరుకునేది లేదు. మిమ్ముల కొట్టనీకి మొగోళ్లు అవస రంలే.. ఆడోళ్లే కొడుతరు. నా ఎన్క నిలవడ్డోళ్లే సాలు.. ఒక్కొక్కళ్లు నలుగుర్ని కొడ్తరు. అంత దమ్ము, ధైర్యమున్నోళ్లు ఉన్నరు. నోరు జారీ పుసుక్కున ఎవర్న న్నా అంటే మాత్రం ఎక్కడ దొర్కితే అక్కడ్నే చిత్తు చిత్తు కొట్టి ఒదిలిపెడ్తరు. ఇప్పటికైనా నోరు దగ్గెరవెట్టుకొని ఉండుర్రి. ఇకముందు కొండా దంపతులకు చెందిన వ్యక్తుల మీద ఈగ వాలినా ఊర్కునేది లేదు' అని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ ఆరోపణలు నిరాధారం

మొదటి పేజీ తరువాయి

భారత ఎన్నికల వ్యవస్థ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో భారతదేశం అనుసరిస్తున్న విధానాలను అనేక దేశాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని చెప్పారు. ఇలాంటి సమయంలో ఎన్నికల ప్రక్రియపై అనుమానాలు వ్యక్తం చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదన్నారు.

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించిన అంశాలపై ప్రజల్లో అపోహలు వ్యాప్తి చేస్తున్నారని రామచందర్ రావు ఆరోపించారు. దీనికి సంబంధించిన వాస్తవాలను ప్రజల ముందుంచామని, తప్పుడు ప్రచారాలను ఖండించామని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, నిబంధనల అమలుకు ఎన్నికల సంఘం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీసే విధంగా రాజకీయ ఆరోపణలు చేయడం సరైన పద్ధతి కాదని ఆయన అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను బలోపేతం చేయడం అన్ని రాజకీయ పార్టీల బాధ్యత అని అభిప్రాయపడ్డారు. ఎన్నికల ప్రక్రియపై ఏవైనా సందేహాలు ఉంటే చట్టబద్ధ మార్గాల్లో ప్రస్తావించాలని సూచించారు.

ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారాల కంటే వాస్తవాల ఆధారంగా రాజకీయ చర్చలు జరగాలని రామచందర్ రావు అన్నారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం నిలబెట్టడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలపై ప్రజలకు సరైన సమాచారం అందించేందుకు బీజేపీ కృషి చేస్తుందని రామచందర్ రావు తెలిపారు.

వేగుచుక్క

వ్యసన రహిత సమాజ నిర్మాణానికి కృషి చేద్దాం..

- 'నశా ముక్త్ యువ' కార్యక్రమంలో బాగంగా "సత్యశోధక్" పాఠశాలలో ప్రతిజ్ఞ.

వేగుచుక్క న్యూస్, సిరికొండ:

వ్యసన రహిత సమాజ నిర్మాణానికి కృషి చేద్దాం అని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య పిలుపునిచ్చారు. జాతీయ ఆరోగ్య మిషన్ మరియు మత్తు పదార్థాల వ్యసనాల నివారణ మరియు "మేరా యువ భారత్" ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "నశా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు సోమవారం సత్యశోధక్ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు "నశా ముక్త్ యువ -- వ్యసనాలపై యువతరం పోరాటం" ప్రతిజ్ఞ చేశారు. వ్యసనాలకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన మరియు బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలనే సంకల్పంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎలాంటి రూపంలోనైనా మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని, ఇతరులను కూడా వ్యసనాల బారిన పడకుండా అవగాహన కల్పిస్తామని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకొని, విద్య మరియు మంచి విలువలకు ప్రాధాన్యతనిస్తూ, వ్యసన రహిత భారతదేశ నిర్మాణంలో తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తామని సంకల్పించారు.

ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య మాట్లాడుతూ, విద్యార్థులు చిన్న వయస్సు నుంచే చెడు అలవాట్లకు దూరంగా ఉండి, ఆరోగ్యం, విద్య, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతల పట్ల చైతన్యంతో ముందుకు సాగాలన్నారు. యువత ఆరోగ్యంగా, బాధ్యతాయుతంగా ఎదిగినప్పుడే బలమైన మరియు అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించగలమని, వ్యసన రహిత సమాజ నిర్మాణానికి కృషి చేద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొని, వ్యసన రహిత సమాజ నిర్మాణానికి తమ నిబద్ధతను వ్యక్తం చేశారు.

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కొరకు స్థల పరిశీలన.

వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:

అర్బన్ నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు చేయాలని ప్రభుత్వానికి అనేకసార్లు కోరడం జరిగిందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. మంగళవారం గుండారం శివారులో స్థలాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాఠశాలకు అవసరమైన 25 ఎకరాల స్థలం అర్బన్ లో కష్టతరమవుతుందన్నారు. ఈ నేపథ్యంలో నగరానికి దగ్గరగా ఉన్న గుండారంలో పరిశీలించడం జరిగిందన్నారు. అలాగే నగరంలోనూ మరో స్థలాన్ని కూడా పరిశీలిస్తున్నామన్నారు. నియోజకవర్గం విద్యార్థులకు ఇంటిగ్రేటెడ్ స్కూల్ అందుబాటులోకి తీసుకురావడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ఇప్పటికే మొదటి దశలో జిల్లాలోని అన్ని నియోజక వర్గాలకు మంజూరయ్యాయన్నారు. రెండో దశలో అర్బన్ లోనూ మంజూరయ్యేలా కృషి చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వెంట రూరల్ తహసీల్దార్ వినయ్ సాగర్, టీఎస్ఈడబ్ల్యూఐసీ ఈఈ రవీందర్, బీజేపీ కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, జ్యోతి మురళి, ప్రసూన శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులను రాష్ట్ర ప్రభుత్వం మోసం.

- కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒకటే...
- అన్ని వర్గాలకు హామీలిచ్చి విస్మరించారు.
- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ..
- అర్బన్ కు చేరుకున్న బిజెపి కిసాన్ మోర్చా సైకిల్ ర్యాలీ...

వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు రైతులకు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ఆరోపించారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బిజెపి కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ యాత్ర మంగళవారం నిజామాబాద్ అర్బన్ కు చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వరంగల్ డిక్లరేషన్ లో రాహుల్ గాంధీ సాక్షిగా రైతులకు అనేక హామీలు ఇచ్చి ఒకటి నెరవేర్చలేదని మండిపడ్డారు. రెండు లక్షల రుణమాఫీ, ఇందిరమ్మ రైతు భరోసా, భూమిలేని రైతు కూలీలకు 12 వేల ఆర్థిక సాయం, రైతు పండించిన ప్రతి పంటను ప్రభుత్వమే ఉంటుందని, వరి క్వింటాలుకు 500 బోనస్ ఇస్తామని చెప్పి విస్మరించిందన్నారు. కేవలం రైతులనే కాకుండా మహిళలకు,

యువతీ యువకులకు ఇచ్చిన హామీలు కూడా నెరవేర్చకుండా కాలయాపన చేస్తుందన్నారు. ఎల్ నినో ప్రభావం రాష్ట్రం పై తీవ్రంగా ఉంటుందని కేంద్ర ప్రభుత్వం హెచ్చరించిన పట్టించుకోలేదన్నారు. సమయం దాటిన తర్వాత ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని చెప్పడం విడ్డూరమన్నారు. అప్పటికే రైతులు వరి వేసుకున్నారని గుర్తు చేశారు. ఫ్యూచర్ సిటీ, మూసీ ప్రక్షాళన అంటూ లక్షల కోట్లు ఖర్చు పెడుతున్నారు కానీ రైతులను మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. గతంలో బీఆర్ఎస్ వ్యవహరించిన మాదిరిగానే కాంగ్రెస్ వ్యవహరిస్తుందన్నారు.

కేంద్ర ప్రభుత్వం అన్ని పథకాల్లో తన వాటాన్ని ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం తామే చేస్తున్నట్లు ప్రచారం చేయడం సిగ్గుచేటు అన్నారు. కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో బోధన్ నుంచి జగిత్యాల వరకు 320 కిలోమీటర్ల సైకిల్ ర్యాలీ చేపట్టడం అభినందనీయమని చెప్పారు కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, హరీష్ రెడ్డి, సుగంధం హరీష్, పద్మా రెడ్డి, కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, బంటు రాము, మల్కాయి మహేందర్, ప్రసూన శ్రీనివాస్ రెడ్డి, బొబ్బిలి సువర్ణ వేణుగోపాల్, ఓబీసీ మోర్చరాష్ట్ర ప్రతినిధి స్వామి యాదవ్, మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు వనిత, మైనార్టీ మోర్చా అధ్యక్షుడు జస్పాల్ సింగ్, యువ మోర్చ రాష్ట్ర సహా కోశాధికారి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బదిరులకు అండగా ఉంటా..

అంతర్జాతీయ సంకేత భాషా దినోత్సవంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్...

వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:

జిల్లాలోని బదిరులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. డెఫ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్ లో అంతర్జాతీయ సంకేత భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... బధిరులకు మేథోశక్తి ఎంతో ఉంటుందన్నారు. సామాన్యులకు ధీటుగా పోటీ ప్రపంచంలో ముందుకు వెళ్ళడం అభినందనీయమన్నారు. బదిరులుగా ఉంటూ ప్రభుత్వ ఉద్యోగులుగా స్థిరపడటం సంతోషంగా ఉందన్నారు. లోపాన్ని పట్టించుకోకుండా తమ పని తాము చేసుకుంటూ పోవాలని విజయం వరిస్తుందన్నారు. కార్యక్రమంలో డెఫ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి మహేష్, 19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ, జ్యోతి మురళి, తదితరులు పాల్గొన్నారు.

నేడు సిరిసిల్లలో సీఎం భారీ బహిరంగ సభ

- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు
- రూ.345.78 కోట్ల పనులకు సిఎం శ్రీకారం
- సీఎంగా తొలిసారి సిరిసిల్లకు రేవంత్ రెడ్డి..
- బహిరంగ సభపై సర్వత్రా నెలకొన్న ఆసక్తి

హైదారాబాద్, సెప్టెంబర్ 29: తెలంగాణ రాజకీయాల్లో సిరిసిల్ల ఇప్పుడు మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. నేడు సిరిసిల్ల నియోజకవర్గంలో పర్యటించనున్నారు. సీఎం హోదాలో ఆయన తొలిసారి సిరిసిల్లకు రావడం ఒకవైపు అయితే.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో భారీ బహిరంగ సభ నిర్వహించనుండటం మరోవైపు రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పర్యటనలో రేవంత్‌రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. సిరిసిల్ల, వేములవాడ ప్రాంతాల్లో విద్య, ఆలయ అభివృద్ధి, పరిపాలనా మౌలిక వసతులు, మహిళా సాధికారత, నేతన్నల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాలు ఉన్నాయి. సిరిసిల్లకు రూ.200 కోట్ల అంచనా వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరైనట్లు ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. సీఎం రేవంత్ రెడ్డి పర్యటనలో భాగంగా సుమారు రూ.345.78 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. వేములవాడలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు సీఎం రేవంత్ శంకుస్థాపన చేయనున్నారు. పెద్దూరులో సుమారు 18 ఎకరాల్లో నిర్మించనున్న ఈ విద్యా సముదాయంలో 5వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు వసతి, తరగతి గదులు, డార్మిటరీలు, డైనింగ్, క్రీడా సదుపాయాలు కల్పించేలా ప్రణాళిక రూపొందించారు. సిరిసిల్ల, కోనరావుపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు ఆధునిక తరగతి గదులు, ల్యాబ్‌లు, డైనింగ్ హాళ్లు, క్రీడా సదుపాయాలు, ఐటీ మౌలిక వసతులు కల్పించనున్నారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు కూడా సీఎం రేవంత్ పర్యటనలో కీలకంగా ఉండనున్నాయి. ఆలయ విస్తరణ, మండపాలు, గోపురాలు, ప్రాకారాలు, సైట్ డెవలప్‌మెంట్, నీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థ, విద్యుత్ పనులు, షాపింగ్ కాంప్లెక్స్, రోడ్ల నిర్మాణం వంటి పనులకు సంబంధించిన 26 పనులకు రూ.99.40 కోట్ల అదనపు నిధులను ప్రభుత్వం ఇప్పటికే మంజూరు చేసింది. దీంతో ఆలయ అభివృద్ధికి ఇప్పటివరకు మంజూరైన మొత్తం నిధులు రూ.249.40 కోట్లకు చేరాయి. జిల్లాలో పరిపాలనా మౌలిక వసతుల విస్తరణలో భాగంగా కొత్త ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణానికీ సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు చేయనున్నారు. సిరిసిల్ల, వేములవాడలో ఆర్డీవో కార్యాలయాలు, పలు మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాలు, వేములవాడలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణాలు ఇందులో ఉన్నాయి. రుద్రంగిలో 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాములు, అనుబంధ యూనిట్ల నిర్మాణానికి కూడా శ్రీకారం చుట్టనున్నారు. ఇక.. సిరిసిల్ల అంటేనే చేనేత, పవర్‌లూమ్ పరిశ్రమ. అందుకే సీఎం రేవంత్ రెడ్డి పర్యటనలో నేతన్నల అంశానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. చేనేత, పవర్‌లూమ్ ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించే ఉద్దేశంతో 'నేతన్న బజార్' ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ముఖ్యంగా సిరిసిల్లలో పవర్‌లూమ్‌లపై ఉత్పత్తి అయ్యే పెట్టీకోట్, పాలియెస్టర్ వస్త్రాలకు మార్కెట్ కల్పించడమే దీని ఉద్దేశంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం చెబుతోంది. అయితే ఈ ప్రాజెక్టుకు తుది మంజూరు, వ్యయం ఇంకా ఖరారు కాలేదని అందుబాటులో ఉన్న వివరాలు సూచిస్తున్నాయి. ఇదే సమయంలో నేతన్నలకు బకాయిలు, వస్త్ర ఆర్డర్లు, బతుకమ్మ చీరల పథకం వంటి అంశాలపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సిరిసిల్ల నేతన్నలకు గత ప్రభుత్వ హయాంలో రూ.300 కోట్ల బకాయిలు మిగిలాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సిరిసిల్లకు వస్త్ర ఆర్డర్లు ఇచ్చిందని ఆయన చెబుతున్నారు. రేవంత్ పర్యటనకు ముందు కేటీఆర్ సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాయడంతో సిరిసిల్ల పర్యటనకు రాజకీయ కోణం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. సిరిసిల్లలో బీఆర్ఎస్ నేతలు 8 వేల ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించారని.. అందులో 2,400 ఎకరాలను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుందని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలకు ఆధారాలు బయటపెట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఏ మండలం, ఏ గ్రామం, ఏ సర్వే నంబర్లు, ఎంత విస్తీర్ణం, ఎవరి పేర్లపై భూములు ఉన్నాయో ప్రజలకు వెల్లడించాలని కోరారు. ఆ ఆరోపణల్లో వాస్తవం ఉంటే శ్వేతపత్రం విడుదల చేయాలని.. నిరూపించలేకపోతే సిరిసిల్ల ప్రజలకు సీఎం రేవంత్ క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. నేతన్నల బకాయిలు, రైతు భరోసా, రుణమాఫీ, బతుకమ్మ చీరల పథకం, సిరిసిల్ల అభివృద్ధి వంటి అంశాలపై కూడా రేవంత్ సమాధానం చెప్పాలని కోరారు. సిరిసిల్లలో సీఎం పర్యటనను కాంగ్రెస్ వర్గాలు అభివృద్ధి కార్యక్రమంగా వివరిస్తున్నప్పటికీ.. రాజకీయంగా మాత్రం ఈ పర్యటనపై ఆసక్తి నెలకొంది. కారణం.. ఇది కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడమే. ఇక ఇటీవల ఈనెల 5వ తేదీన నకిరేకల్ సభలో ప్రసంగించిన రేవంత్‌రెడ్డి.. సిరిసిల్ల, సిద్ధిపేట, గజ్వేల్ నియోజకవర్గాల్లో తాను త్వరలోనే పర్యటిస్తానని ప్రకటించారు. సిరిసిల్ల తర్వాత సిద్ధిపేటకు వెళ్లనున్నట్లు ఆయన అప్పట్లో చెప్పారు. సిరిసిల్ల కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కాగా.. సిద్ధిపేట హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం.. అటు గజ్వేల్ ఎమ్మెల్యేగా మాజీ సీఎం కేసీఆర్ ఉన్నారు. సిరిసిల్లలో రేవంత్ భారీ సభ నిర్వహించనుండటంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం కనిపిస్తోంది. భారీ జనసమీకరణకు పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. రోడ్‌షో, బహిరంగ సభ, మంత్రులు, స్థానిక నాయకుల పాల్గొనడం వంటి అంశాలతో కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ నేతల వ్యాఖ్యల్లో మాత్రం రాజకీయ టోన్ స్పష్టంగా కనిపిస్తోంది. ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ సిరిసిల్ల, సిద్ధిపేట, గజ్వేల్‌లపై కాంగ్రెస్ వరుసగా దృష్టి పెడుతోందని అన్నారు. మరో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.. సీఎం సిరిసిల్ల పర్యటనతో కేటీఆర్ గత పాలనకు సంబంధించిన అంశాలు చర్చకు వస్తాయని వ్యాఖ్యానించారు.

మయన్మార్‌లో వైమానిక దాడి..

అరాకన్ ఆర్మీ ప్రాంతంలో సైన్యంపై దాడి

49 మంది మృతి, 58 మందికి గాయాలు

మయన్మార్,సెప్టెంబర్ 29: మయన్మార్ పశ్చిమ రఖైన్ రాష్ట్రంలో, తిరుగుబాటుదారుల బృందమైన అరాకన్ ఆర్మీ నియంత్రణలో ఉన్న ప్రాంతంలో సైన్యం జరిపిన వైమానిక దాడిలో కనీసం 49 మంది మరణించగా, 58 మంది గాయపడ్డారు. అరాకన్ ఆర్మీ, సహాయక చర్యలలో పాల్గొన్న ఒక అధికారి ప్రకారం, సోమవారం క్యౌక్తావ్ టౌన్‌షిప్‌లోని ఒక స్థానిక మార్కెట్ సమీపంలో ఒక యుద్ధ విమానం రెండు బాంబులను జారవిడిచింది. మృతులలో మార్కెట్ వ్యాపారులు, సరుకులు కొనడానికి వచ్చిన వినియోగదారులు, రోడ్డుపై నడుస్తున్న సాధారణ ప్రజలు ఉన్నారని చెబుతున్నారు. గాయపడిన వారిలో 22 మంది పరిస్థితి విషమంగా ఉందని అరాకన్ ఆర్మీ పేర్కొంది. ఘటనా స్థలంలోని సహాయక సిబ్బంది నుండి అందిన సమాచారం ఆధారంగా, రఖైన్‌లో సహాయక చర్యలలో పాల్గొంటున్న సీనియర్ అధికారి వాయ్ హ్టాన్ ఆంగ్ మృతుల సంఖ్యను ధృవీకరించినట్లు అసోసియేటెడ్ ప్రెస్ నివేదించింది. ఆ మార్కెట్ రాష్ట్రంలోని ప్రధాన టోకు వ్యాపార కేంద్రాలలో ఒకటి, ఇది వివిధ ప్రాంతాల నుండి వ్యాపారులను, వినియోగదారులను ఆకర్షిస్తుంది. తమ నియంత్రణలో ఉన్న ప్రాంతంలో జరిగిన ఈ ఘటనను ఒక తీవ్రమైన వైమానిక దాడిగా పేర్కొంటూ, బాధ్యులైన పక్షాలు, సంస్థలపై సమర్థవంతమైన ప్రతీకార చర్యలు తీసుకుంటామని అరాకన్ ఆర్మీ హెచ్చరించింది. దాడి తర్వాత సోషల్ మీడియాలో విడుదలైన ఫోటోలు, వీడియోలలో కొన్ని భవనాలు తగలబడుతుండటం, వాహనాలు దెబ్బతినడం, సమీపంలోని వంతెనలో కొంత భాగం ధ్వంసం కావడం కనిపించింది. ఈ ఘటనపై మయన్మార్ సైన్యం ఇంకా స్పందించలేదు. అయితే, తాము కేవలం చట్టబద్ధమైన సైనిక నిర్మాణాలనే లక్ష్యంగా చేసుకుంటామని సైన్యం గతంలో పేర్కొంది. తిరుగుబాటు గ్రూపులు ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని ఆరోపించింది. మయన్మార్‌లోని రెండవ అతిపెద్ద నగరమైన మాండలేకు పశ్చిమాన సుమారు 340 కిలోమీటర్ల దూరంలో క్యౌక్తావ్ ఉంది. ఈ ప్రాంతం ప్రస్తుతం అరాకన్ ఆర్మీ నియంత్రణలో ఉందని చెబుతున్నారు.

పేదల కన్నీటికి విలువ కట్టలేం..

ఏడాదిలోపే ఇందిరమ్మ ఇళ్ల తాళాలు అందిస్తాం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

హైదారాబాద్, సెప్టెంబర్ 29 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదవాడి కష్టం తెలిసిన ఇందిరమ్మ ప్రభుత్వమని, పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలన్న సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పేదవాడు తన జీవితకాలంలో ఒక్కసారైనా సొంత ఇంటిని చూసుకోవాలన్న ఆకాంక్షను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. క్యూఆర్/కోర్ ప్రాంతంలో ప్రభుత్వానికి చెందిన వివిధ శాఖల భూములను గుర్తించి, వాటిని హౌసింగ్ శాఖకు బదలాయించి పేదల కోసం గ్రౌండ్ ప్లస్ టెన్ అంతస్తుల అపార్ట్‌మెంట్లు నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. నాంపల్లి శాసనసభ నియోజకవర్గంలోని రెడ్ హిల్స్ లో మంగళవారం ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి మంత్రి పొంగులేటి సహచర మంత్రి అజారుద్దీన్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహానగరంలో ఒక్కో ఎకరం భూమి విలువ రూ.200 కోట్లు, రూ.250 కోట్లు ఉన్నా.. ఆ భూమి ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడం కంటే పేద కుటుంబానికి ఒక సొంత ఇల్లు ఇవ్వడమే ప్రజా ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు. ఈరోజు పారదర్శకంగా నిర్వహించి అవసరమైతే పిల్లల చదువులు, వివాహాలు వంటి కుటుంబ అవసరాల కోసం రుణం పొందే అవకాశం ఉండేలా ఇళ్లను రూపాయి కమిషన్ లేకుండా, రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా నేరుగా లబ్ధిదారుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించే చర్యలు తీసుకుంటామని చెప్పారు. టవర్స్‌లో నివసించే కుటుంబాలకు డ్రైనేజీ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను అక్కడికక్కడే ఆదేశించారు. ఇందిరమ్మ ప్రభుత్వం అంటేనే ఇందిరమ్మ ఇల్లు. ప్రతి తండాలో, ప్రతి గూడెంలో, ప్రతి డివిజన్‌లో, ప్రతి వార్డులో పేదలకు ఇళ్లు నిర్మించి చూపిస్తాం" అని మంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వం పదేళ్లలో చేసిన ఇళ్ల నిర్మాణం కంటే ప్రజా ప్రభుత్వం తొలి విడతలోనే రెట్టింపు ఇళ్లు నిర్మించి చూపిస్తుందని మంత్రి అన్నారు. పేదల సొంతింటి కలను ఎన్నికల హామీగా కాకుండా, ప్రభుత్వ

క్రీడలు, కళలపై ఉద్యోగులు ఆసక్తి పెంచుకోవాలి

- పని ఒత్తిడితో ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తుంటారు
- ప్రాచీన సంస్కృతిని మనందరం కాపాడుకోవాలి
- పర్యాటక, సాంస్కృతిక మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదారాబాద్, సెప్టెంబర్ 29 : ఉద్యోగులు విధులను సమర్థంగా నిర్వర్తించడంతో పాటు క్రీడలు, కళలు, సాంస్కృతిక కార్యక్రమాలపై ఆసక్తి పెంచుకోవాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సచివాలయ సాంస్కృతిక ఉత్సవానికి మంత్రి జూపల్లి కృష్ణారావు, స్పెషల్ సీఎస్ మహేష్ దత్ ఎక్కా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉద్యోగులు నిత్యం ఎంతో బిజీగా, పని ఒత్తిడితో విధులు నిర్వర్తిస్తుంటారని తెలిపారు. ఉద్యోగి పని సామర్థ్యంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యం కూడా ముఖ్యమన్నారు. క్రీడలు, కళలు, సాహిత్యం, సంగీతం, నృత్యం మనసుకు శారీరక, మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని మంత్రి అన్నారు. సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందిలో దాగి ఉన్న కళా ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఉద్యోగులు కేవలం ఫైళ్లు, విధులు, బాధ్యతలకే పరిమితం కాకుండా తమలోని సృజనాత్మకతను కూడా వెలికితీయాలని సూచించారు. గెలుపు, ఓటమి కంటే కార్యక్రమాల్లో పాల్గొనడం, తమ ప్రతిభను ప్రదర్శించడం, సహోద్యోగులతో కలిసి ఆనందాన్ని పంచుకోవడం ముఖ్యమని చెప్పారు. ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని పెంచేందుకు తరచుగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకోవాలని జూపల్లి సూచించారు. ఉద్యోగులు బాగా పనిచేస్తే దాని ప్రభావం ప్రభుత్వ పనితీరు, ప్రజలకు అందే సేవలపై ఉంటుందని అన్నారు. విధులతో పాటు ఆటలు, క్రీడలు, పాటలపై ఆసక్తి పెంచుకోవడం వల్ల ఉద్యోగుల్లో కొత్త ఉత్సాహం వస్తుందని పేర్కొన్నారు. భారతదేశానికి ఎంతో ప్రాచీనమైన సంస్కృతి, సంప్రదాయాలు, కళలు ఉన్నాయని మంత్రి తెలిపారు. విదేశాల్లో స్థిరపడిన భారతీయులు సైతం తమ పిల్లలకు భారతీయ కళలు, సంస్కృతిని నేర్పిస్తున్నారని గుర్తుచేశారు. ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తూనే మన పూర్వీకులు అందించిన కళలు, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాన్ని మంత్రి గుర్తుచేసుకున్నారు. 2011లో ఎమ్మెల్యే, మంత్రి పదవులకు రాజీనామా చేసి ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పాదయాత్ర చేపట్టిన సమయంలో ఆటపాటలే తనకు ఎంతో స్ఫూర్తినిచ్చాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించి ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఎంతో మంది ప్రాణత్యాగాలు చేశారని అన్నారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని ఆకాంక్షించారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఉద్యోగులు చేపట్టే సాంస్కృతిక కార్యక్రమాలకు సాంస్కృతిక శాఖ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంగీత దర్శకుడు రాధాకృష్ణ, తెలంగాణ సచివాలయ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు గిరి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జే. ప్రేమ్, ఉపాధ్యక్షుడు నవీన్‌కుమార్, కల్చరల్ సెక్రటరీ యామిని కనకతార తదితరులు పాల్గొన్నారు.

వేగుచుక్క

నష్టాల్లో ముగిసిన సూచీలు



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా రెండో రోజూ నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల కారణంగా క్రూడాయిల్ ధరలు గరిష్ఠ స్థాయిలో కొనసాగుతున్నాయి. దీనికితోడు విదేశీ మదుపర్ల అమ్మకాలు మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఈ క్రమంలోనే సూచీలు ఆరు నెలల కనిష్ఠ స్థాయికి చేరాయి. సెన్సెక్స్ ఉదయం 72,633.68 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 72,771.72) నష్టాల్లో ప్రారంభమైంది. ఆరంభంలో భారీ నష్టాల్లోకి సూచీ జారుకుంది. దాదాపు 700 పాయింట్ల నష్టంతో 72,064.00 వద్ద కనిష్ఠాన్ని తాకింది. తర్వాత కాస్త కోలుకున్న సూచీ.. చివరికి 242.65 పాయింట్ల నష్టంతో 72,529.07 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 64.05 పాయింట్ల నష్టంతో 22,716.20 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.98గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టైటాన్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీసీఎస్, అల్ట్రాటెక్ సిమెంట్, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అదానీ పోర్ట్స్, సన్‌ఫార్మా, టాటా స్టీల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎన్టీపీసీ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 104 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు ధర 4149 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

బిజినెస్

మరోసారి సిమెంట్ ధరల షాక్..

అక్టోబర్‌లో 20 వరకు పెంపు?

దేశంలో సిమెంట్ ధరలు పెంచేందుకు కంపెనీలు మరోసారి సన్నద్ధమవుతున్నాయి. అక్టోబర్‌లో బస్తాపై రూ.5 నుంచి రూ.20 వరకు పెరిగే అవకాశం ఉందని సెంట్రమ్ బ్రోకింగ్ నివేదిక తెలిపింది. సెప్టెంబర్ నెలలో దేశవ్యాప్తంగా బస్తాకు సగటున రూ.7 చొప్పున సిమెంట్ ధరలు పెరిగాయని, మరోసారి ధరల సవరణ చేపట్టొచ్చిన పేర్కొంది. సిమెంట్ ఉత్పత్తి, రవాణాలో చమురు ధరలు కీలక పాత్ర పోషిస్తాయి. ఇటీవల కాలంలో చమురు ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో కంపెనీలు ధరలు పెంచే అవకాశం ఉందని నివేదిక తెలిపింది. ఈ ఏడాది జులై, ఆగస్టు నెలల్లో స్తబ్దుగా ఉన్న సిమెంట్ ధరలు.. సెప్టెంబర్‌లో దేశవ్యాప్తంగా సగటున బస్తాకు రూ.7 చొప్పున పెరిగి రూ.356కి చేరినట్లు పేర్కొంది. దక్షిణాదిలో అత్యధికంగా బస్తాకు రూ.11 చొప్పున పెరగ్గా.. కొన్ని చోట్ల రూ.9, మరికొన్ని చోట్ల రూ.5 చొప్పున పెరిగినట్లు తెలిపింది. కంపెనీల బిల్లింగ్ రేట్లు పెరిగినప్పటికీ, డీలర్లు అమ్మకాల లక్ష్యాల కోసం పాత ధరలకే విక్రయించడం వల్ల వినియోగదారులపై ఆ భారం ఇంకా పూర్తిగా పడలేదని నివేదిక పేర్కొంది. సెప్టెంబర్ నెలలో వర్షాల కారణంగా కొన్నిచోట్ల నిర్మాణాలు కాస్త నెమ్మదించగా.. మరికొన్నిచోట్ల వర్షపాతం లేని కారణంగా నిర్మాణ కార్యకలాపాలు జోరందుకున్నాయి. దీంతో సిమెంట్ డిమాండ్‌కు ఢోకా ఉండదని కంపెనీలు భావిస్తున్నాయి. అయితే, అక్టోబర్ నెలకు సంబంధించి మార్కెట్ డిమాండ్ పుంజుకోవడం, ధరల పెంపునకు డీలర్ల ఆమోదంపైనే నిర్ణయం ఆధారపడి ఉంటుందని నివేదిక తెలిపింది. ఆశించిన స్థాయిలో డిమాండ్ ఉంటే బస్తాకు రూ.5-20 మేర పెరిగే అవకాశం ఉందని బ్రోకింగ్ సంస్థ అంచనా వేసింది.

కోహ్లీని స్వేచ్ఛగా ఆడనిస్తే ఒంటిచేత్తో గెలిపిస్తాడు

భారత క్రికెట్ జట్టు కెప్టెన్ శుభమన్ గిల్ ప్రశంసల వర్షం

భారత స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీపై భారత క్రికెట్ జట్టు కెప్టెన్ శుభమన్ గిల్ ప్రశంసల వర్షం కురిపించాడు. తిరువనంతపురం వేదికగా పర్యాటక వెస్టిండీస్ జట్టుతో ఆదివారం జరిగిన తొలి వన్డే మ్యాచ్‌లో భారత్ ఎనిమిది వికెట్ల తేడాతా ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో కెప్టెన్ గిల్, స్టార్ ఆటగాడు కోహ్లీ శతకాలతో రెచ్చిపోయారు. ఫలితంగా ప్రత్యర్థి నిర్దేశించిన 295 పరుగుల లక్ష్యాన్ని సునాయాసంగా 41.4 ఓవర్లలోనే చేరుకుంది. మ్యాచ్ అనంతరం కెప్టెన్ గిల్ స్పందిస్తూ, మ్యాచ్ అనంతరం కెప్టెన్ శుభ్మన్ గిల్ మాట్లాడుతూ, జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన విరాట్ కోహ్లిపై ప్రశంసల వర్షం కురిపించాడు. 'విరాట్ భాయ్‌ను తన ఆటను ఆస్వాదించనివ్వాలి. అతడిని ఎలాంటి ఒత్తిడికి గురిచేయాల్సిన అవసరం లేదు. తనదైన రోజున ఎలాంటి మ్యాచ్‌నైనా ఒంటిచేత్తో గెలిపించగల సత్తా అతడికి ఉంది. ప్రస్తుతం కోహ్లీ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు' అని గిల్ అన్నాడు. ఇదే మ్యాచ్‌లో కోహ్లీ 15,000 వన్డే పరుగుల మైలురాయిని అందుకోవడం విశేషం. తన సెంచరీ సంతోషాన్నిచ్చినా, మ్యాచ్‌ను ముగించలేకపోయాననే స్వల్ప అసంతృప్తి ఉందని గిల్ వ్యాఖ్యానించాడు. కాగా, ఈ మ్యాచ్‌లో కోహ్లీ 88 బంతుల్లో 139 పరుగులు చేయగా, గిల్ 110 రన్స్ చేశారు. దీంతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యాన్ని దక్కించుకుంది.

జట్టులోని వాతావరణం నచ్చకనే కోహ్లీ రిటైర్మెంట్

మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ సంచలన వ్యాఖ్యలు

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ టెస్ట్ రిటైర్మెంట్‌పై మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. జట్టులోని వాతావరణం నచ్చకనే రిటైర్మెంట్ ప్రకటించాడని అభిప్రాయపడ్డాడు. గతేడాది తనకు ఎంతో ఇష్టమైన టెస్ట్ క్రికెట్ నుంచి విరాట్ కోహ్లీ ఆకస్మికంగా తప్పుకున్నాడు. అతని నిర్ణయం యావత్ క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. అనేక సందేహాలకు తావిచ్చింది. తన నిర్ణయానికి ముందే విరాట్ కోహ్లీ రంజీ ట్రోఫీ ఆడాడు. టెస్ట్ క్రికెట్‌లో కొనసాగేందుకు ఆసక్తి చూపించాడు. కానీ అంతలోనే ఏమైందో ఏమో తెలియదు కానీ.. సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. మానసిక ఒత్తిడితోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పలు ఇంటర్వ్యూల్లో కోహ్లీ చెప్పాడు. తాజాగా కోహ్లీ టెస్ట్ రిటైర్మెంట్ గురించి తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన కైఫ్.. పరోక్షంగా గంభీర్‌పై ఆరోపణలు గుప్పించాడు.' టెస్ట్ రిటైర్మెంట్ గురించి విరాట్ కోహ్లీ ఇంటర్వ్యూలు చూసినప్పుడు నాకు ఒక విషయం అర్థమైంది. అతని ముఖంలో కొంత నిరాశ కనిపించింది. ఫామ్ బాగాలేకపోయినా.. అతను విరాట్ కోహ్లీ. వన్డేల్లో కూడా అతను ఒడిదొడుకులు ఎదుర్కొన్నాడు. అతని ఇంటర్వ్యూలను బట్టి చూస్తే.. జట్టు వాతావరణం నచ్చకనే రిటైర్మెంట్ ప్రకటించినట్లు అనిపిస్తోంది. జట్టులో విరాట్ కోహ్లీకి తగిన ప్రాధాన్యత, మద్దతు లభించడం లేదని అతను భావించినట్లు అనిపించింది. అతను గనుక కొనసాగించి ఉంటే.. కచ్చితంగా పూర్వ వైభవం అందుకునేవాడని నా అభిప్రాయం. రీఎంట్రీకి అతను పెట్టింది పేరు.'అని కైఫ్ అభిప్రాయపడ్డాడు. టెస్ట్ క్రికెట్‌లో 10 వేల పరుగుల మైలురాయి అందుకోకూండానే విరాట్ కోహ్లీ రిటైర్మెంట్ ప్రకటించాడు. మరో 770 పరుగులు చేస్తే ఈ ఫీట్ సాధించేవాడు. తన కెరీర్‌లో 123 టెస్టులు ఆడిన కోహ్లీ 9230 పరుగులు చేశాడు. ఇందులో 30 శతకాలతో పాటు 31 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. 2011లో వెస్టిండీస్‌తో టెస్ట్ క్రికెట్ ప్రారంభించిన కోహ్లీ.. కెరీర్ ఆరంభంలో తడబడ్డాడు. జట్టులో కూడా చోటు కోల్పోయాడు. 2011-12 బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో సత్తా చాటాడు. 2014లో ధోనీ వారసుడిగా టెస్ట్ బాధ్యతలు అందుకున్నాడు. కోహ్లీ సారథ్యంలో భారత్ 68 మ్యాచ్‌లు ఆడి 40 విజయాలు సాధించింది. భారత మోస్ట్ సక్సెస్‌ఫుల్ టెస్ట్ కెప్టెన్‌గా నిలిచాడు. విరాట్ కోహ్లీ కన్నా ముందు రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించాడు.

ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్ రికార్డ్ బ్రేక్

5 రోజుల్లో 3మెడల్స్ గెలిచిన గుల్వీర్



సియా క్రీడల్లో భారత అథ్లెట్స్ పతకాల పంట పండిస్తున్నారు. మూడు పతకాలు సాధించిన రెండవ భారతీయ అథ్లెట్‌గా గుల్వీర్ సింగ్ నిలిచారు. గతంలో ఈ చారిత్రాత్మక రికార్డు దిగ్గజ భారతీయ అథ్లెట్ పి.టి. ఉష పేరిట ఉండేది. పి.టి. ఉష 1986 సియోల్ ఆసియా క్రీడల్లో నాలుగు స్వర్ణ పతకాలు, ఒక రజత పతకాన్ని గెలుచుకున్నారు. 1986 ఆసియా క్రీడల తర్వాత మొదటిసారిగా ఒక భారతీయ క్రీడాకారుడు పతకాల హ్యాట్రిక్ సాధించాడు. ఆసియా క్రీడలలో గుల్వీర్ ప్రయాణం ఒక సినిమా కథను తలపించేలా సాగింది. అతను కేవలం ఐదు రోజుల్లోనే నాలుగు పరుగుల పోటీలలో పాల్గొన్నాడు. 1,500 మీటర్ల నుండి 10,000 మీటర్ల వరకు జరిగిన వివిధ ఈవెంట్లలో అతను ట్రాక్‌పైకి దిగి, ప్రతిసారీ పతకం సాధించాడు. గుల్వీర్ సాధించిన చారిత్రాత్మక హ్యాట్రిక్ పురుషుల 10,000 మీటర్ల పరుగు పందెంతో మొదలైంది. అతను ఈ పందెన్ని 28:29.38 నిమిషాల్లో పూర్తి చేసి రజత పతకాన్ని గెలుచుకున్నాడు. ఆ తర్వాత 1,500 మీటర్ల పరుగులో 3:36.72 సమయంతో తన వ్యక్తిగత అత్యుత్తమ రికార్డును నమోదు చేసి మరో రజత పతకాన్ని సాధించాడు. వరుసగా మూడు రేసుల వల్ల కలిగిన ఒత్తిడి, అలసట ఉన్నప్పటికీ, గుల్వీర్ ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. పురుషుల 5000 మీటర్ల ఫైనల్‌లో 13:32.75 సమయంతో మూడవ స్థానంలో నిలిచి, అతను కాంస్య పతకాన్ని సాధించాడు. జపాన్‌లో ఐదు రోజుల్లో మూడు పతకాలు సాధించడం ద్వారా గుల్వీర్ భారత త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా రెపరెపలాడించాడు. ఈ ఘనతతో భారత అథ్లెటిక్స్ చరిత్రలో అతని పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది. ఆసియా క్రీడల తర్వాత ఇప్పుడు ఒలింపిక్స్‌లోనూ అటువంటి ప్రదర్శనే చేసి భారత్ కోసం పతకం సాధించాలని గుల్వీర్ ఆశిస్తున్నాడు. ఆసియా ఒలింపిక్స్‌లో గుల్వీర్ సింగ్ రికార్డు బ్రేక్ చేయడమే కాకుండా వరుసగా నాలుగు పతకాలు సాధించడం పట్ల కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికగా అభినందిస్తూ పోస్ట్ పెట్టారు. నీలాంటి వాళ్లు దేశఖ్యాతిని పెంచిన ఛాంపియన్స్ అంటూ కితాబిచ్చారు.

రీఎంట్రీ ఇవ్వనున్న సిరాజ్

టీమిండియా మరో ఆసక్తికరపోరుకు సిద్ధం

వెస్టిండీస్‌తో రెండో వన్డేకు భారత తుది జట్టు ప్రకటన

వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌లో శుభారంభం చేసిన టీమిండియా మరో ఆసక్తికరపోరుకు సిద్ధమైంది. గువహతి వేదికగా బుధవారం జరగనున్న రెండో వన్డేలో పర్యాటక విండీస్‌తో ఆతిథ్య భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. విరాట్ కోహ్లీ, శుభ్‌మన్ గిల్‌ల విధ్వంసకర శతకాలతో తొలి మ్యాచ్‌లో గెలిచిన భారత్.. మూడు వన్డేల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో నిలిచింది. రెండో వన్డేలోనూ విజయం సాధించి మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ కైవసం చేసుకోవాలనుకుంటోంది. తద్వారా ఆఖరి వన్డేలో బెంచ్ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలని భావిస్తోంది. మరోవైపు తొలి వన్డేలో చేసిన తప్పిదాలను సరిచేసుకొని రెండో మ్యాచ్‌లో విజయం సాధించాలనే పట్టుదలతో వెస్టిండీస్ ఉంది. దాంతో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. తొలి వన్డేకు దూరంగా ఉన్న మహమ్మద్ సిరాజ్.. ఈ మ్యాచ్ ఆడే అవకాశం ఉంది. సిరాజ్ కోసం ప్రసిధ్ కృష్ణకు విశ్రాంతి ఇవ్వవచ్చు. మిగతా కాంబినేషన్‌లో పెద్దగా మార్పులు జరిగే అవకాశం లేదు. రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ ఓపెనర్లుగా ఆడనుండగా.. విరాట్ కోహ్లీ ఫస్ట్ డౌన్‌లో ఆడనున్నాడు. రుతురాజ్ గైక్వాడ్ నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేయనున్నాడు. తొలి వన్డేలో ఈ నలుగురికే బ్యాటింగ్ చేసే అవకాశం రాగా.. కోహ్లీ, గిల్ శతకాలతో చెలరేగారు. 32 పరుగులతో రోహిత్ పర్వాలేదనిపించినా.. అతను భారీ ఇన్నింగ్స్ బాకీ ఉన్నాడు. రవీంద్ర జడేజా, కేఎల్ రాహుల్, నమన్ ధీర్, నితీష్ కుమార్ రెడ్డి తర్వాతి స్థానాల్లో బౌలింగ్ చేయనున్నారు. స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్ ఆడనున్నాడు. తొలి వన్డేలో కుల్దీప్ యాదవ్ 4 వికెట్లతో సత్తా చాటాడు. గువాహటి భారత్‌కు కలిసొచ్చిన మైదానం. ఇక్కడ ఆడిన రెండు వన్డేల్లోనూ టీమిండియా గెలిచింది. కోహ్లీ ఈ రెండు మ్యాచ్‌ల్లోనూ సెంచరీలు చేయగా, రోహిత్ శర్మ కూడా ఓ సెంచరీ, ఓ అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. ఈ వేదికపై జరిగిన నాలుగు వన్డే ఇన్నింగ్స్‌ల్లోనూ 300కు పైగా పరుగులు నమోదయ్యాయి. దీంతో మరోసారి బ్యాటర్లదే ఆధిపత్యంగా సాగే అవకాశం కనిపిస్తోంది. బౌలింగ్ విభాగంలో మార్పులు ఉంటాయా అన్నది ఆసక్తికరంగా మారింది. తొలి వన్డేలో మహ్మద్ సిరాజ్, ఆకిబ్ నబీ బెంచ్‌కే పరిమితమయ్యారు. ధ్రువ్ జురెల్‌కు అవకాశం ఇవ్వడంతో పాటు యశస్వి జైస్వాల్‌ను కూడా ఆడించే ఆలోచన ఉండొచ్చని తెలుస్తోంది. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం, జియోహాట్‌స్టార్‌లో లైవ్ స్ట్రీమింగ్ ఉంటుంది. తొలి వన్డేలో కోహ్లీ 88 బంతుల్లో అజేయంగా 139 పరుగులు చేశాడు. గిల్ 108 బంతుల్లో 110 పరుగులతో మెరిశాడు. వెస్టిండీస్ తరఫున జాన్ క్యాంప్‌బెల్ 60 బంతుల్లో 62, జస్టిన్ గ్రీవ్స్ 108 బంతుల్లో 101 పరుగులు చేశారు. ఒక దశలో విండీస్ 19 ఓవర్లకు వికెట్ నష్టపోకుండా 135 పరుగులు చేసింది. ఆ తర్వాత కుల్దీప్ యాదవ్ (4/40) అద్భుత బౌలింగ్ తో కీలక వికెట్లు తీసి మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పాడు.

భారత జట్టు : శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రుతురాజ్ గైక్వాడ్, కేఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), ధ్రువ్ జురెల్, నితీష్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, మహమ్మద్ సిరాజ్, అకిబ్ నబీ, యశస్వి జైస్వాల్, నమన్ ధీర్.

ఏఐ వల్ల బేసిక్ మ్యాథ్స్‌ను పిల్లలు మర్చిపోతున్నారు

: ఎన్విడియా సీఈఓ

కృత్రిమ మేధ కారణంగా పిల్లలు ప్రాథమిక గణితాన్ని మర్చిపోతున్నారని ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ ఆందోళన వ్యక్తం చేశారు. హోం వర్క్‌ను త్వరగా పూర్తి చేయడానికి విద్యార్థులు ఏఐపై ఎక్కువగా ఆధార పడుతున్నారని, దీనివల్ల సొంతంగా ఆలోచించే శక్తి తగ్గుతుందన్నారు. ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పాడ్‌కాస్ట్‌లో పిల్లలపై ఏఐ ప్రభావం ఏ మేర ఉందనే ప్రశ్న ఎదురవ్వగా.. జెన్సన్ హువాంగ్ తనదైన శైలిలో స్పందించారు. 'ఏఐ వల్ల ప్రాథమిక గణితాలను పిల్లలు మర్చిపోతున్న మాట నిజమే. కానీ, భవిష్యత్తులో ఇది ఏఐ ప్రపంచానికి పెద్ద సమస్యగా మారకపోవచ్చు. యువతరం చిన్న చిన్న విషయాలను మర్చిపోయినా.. కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడంలో, అత్యున్నతంగా ఆలోచించడంలో ముందుంటున్నారు' అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఆయన తన వ్యక్తిగత అనుభవాన్ని పంచుకుంటూ.. ప్రపంచంలోనే అతిపెద్ద కంపెనీకి నాయకత్వం వహిస్తున్న తాను కూడా ఒక సందర్భంలో తన ఇంటి చిరునామాను మర్చిపోయానని గుర్తుచేసుకున్నారు.

అమెరికాలో ఎస్సార్ గ్రూప్ రూ.1.4లక్షల కోట్ల పెట్టుబడులు

ప్రకటించిన ట్రంప్

భారత్‌కు చెందిన దిగ్గజ వ్యాపార సంస్థ ఎస్సార్ గ్రూప్ అమెరికాలో భారీగా పెట్టుబడులు పెట్టనుంది. యూఎస్‌లో తన అనుబంధ సంస్థ మొసాబి మెటాలిక్స్ ద్వారా 15 బిలియన్ డాలర్లు (రూ.1.4 లక్షల కోట్లు) ఇన్వెస్ట్ చేయనుంది. ఈ విషయాన్ని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అయోవా రాష్ట్రంలో ఉక్కు కార్మాగార నిర్మాణానికి ఎస్సార్ గ్రూప్ ఈ భారీ మొత్తాన్ని సమకూర్చనుంది. ఈ ఉక్కు కార్మాగారం అమెరికా చరిత్రలోనే అతిపెద్దదని ట్రంప్ అభివర్ణించారు. దీనిద్వారా ప్రతి ఏటా 10 మిలియన్ టన్నుల స్టీల్ ఉత్పత్తి కానుందని చెప్పారు. దీని నిర్మాణ సమయంలో 6వేల తాత్కాలిక ఉద్యోగాలు, 2000 మందికి శాశ్వత ప్రాతిపదకన మైనింగ్, తయారీ విభాగాల్లో ఉపాధి దొరకనుందని వెల్లడించారు. ట్రంప్ టారిఫ్ విధానాల వల్లే దేశంలోకి ఈ స్థాయి పెట్టుబడులు వచ్చాయని వాణిజ్య శాఖ మంత్రి హోవార్డ్ లుట్నిక్ పేర్కొనడం గమనార్హం. "ఈ సుంకాలే లేకపోతే ఈ కర్మాగార నిర్మాణం ఉండేదే కాదు" అని టారిఫ్‌లకు, పెట్టుబడులకు ముడిపెట్టారు. స్టీల్ దిగుమతులపై ట్రంప్ యంత్రాంగం 50 శాతం సుంకం విధిస్తోంది. దిగుమతులకు సుంకాలు చెల్లించే బదులు అమెరికాలో తయారీకి కంపెనీలు మొగ్గుచూపుతున్నాయని పేర్కొంది.